క్లుప్తంగా

ఘనంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజేశ్వరి రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి ఉయ్యాల సేవలో గ్రామ ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి జాతర సందర్భంగా గ్రామ ఆడపడుచులకు పసుపు, కుంకుమలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సోమవారం రాత్రి అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ జాతర నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. రావులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ జనరల్ కోర్సుల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియం అందుబాటులో ఉన్నాయన్నారు. 2023లో తమ కళాశాల విద్యార్థులకు 70 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన వివరించారు.

చలివేంద్రం ఏర్పాటు



జగ్గన్నపేటలో చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట దేవాంగ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సమీపాన ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రతి రోజు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని దేవాంగ సంఘం ప్రతినిధులు తెలిపారు. దాతలు కటకం సత్యనారాయణ, పిచ్చుక చరణ్, పిచ్చుక వరుణ్‌ల సహకారంతో ఇంత వరకు చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేశామన్నారు.

పశుగణాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ఆలమూరు: మేలు జాతి పశుగణాభివృద్ధికి రైతులందరూ తమ వంతు తోడ్పాటును అందించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. మేలు జాతి మగ దూడలను పరీక్షలు నిర్వహించేందుకు మండలంలోని గుమ్మిలేరుకు మంగళవారం ఆయన వచ్చారు. మేలు జాతి ముర్రా జాతి దూడలను గుర్తించి వాటికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులు లేని దూడలను గుర్తించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఏడీలు ఒ.రామకృష్ణ, ఎల్.అనిత, పశువైద్యాధికారులు నిఖిల్ వర్మ, సుభాష్‌చంద్ర, భావన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి మృతి

కొత్తపేట: స్థానిక బాబులుగారి కాలనీలో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వాడపాలేనికి చెందిన సలాది ధనరాజు (32) సోమవారం స్థానిక పంచాయతీ పరిధిలోని బాబులుగారి కాలనీలో పొగాకు కొట్టు వద్ద అప్పీ ట్రక్ ఆటోలో పొగాకు కట్టలు లోడ్ చేసి, పైన బరకం కప్పుతుండగా ప్రమాదవశాత్తూ ఆ పైనుంచి వెళ్లిన విద్యుత్ లైన్ వైర్లు తగిలి షాక్‌తో కిందపడిపోయి గాయపడ్డాడు. వెంటనే అతడికి కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స జరిపి ఉన్నత వైద్యం నిమిత్తం రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సామాజిక తనిఖీలు

అయినవిల్లి: మండలంలోని 2022-23 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆడిట్ నివేదికలు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ సీహెచ్ సత్యనారాయణ ప్రజావేదికలో వివరించారు. 2022-23 సంవత్సరానికి గాను 926 ఉపాధి పనులు నిర్వహించారు. రూ.9.74 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. 21 గ్రామాల్లోని మస్టర్‌రోల్‌లో దిద్దుబాట్లు, యాడింగ్స్ ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే పలు గ్రామాల్లో పనులు జరిగిన చోట్ల పేర్లుతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలేదన్నారు. వేదికలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

కాంగ్రెస్ విజయంతో విధ్వంసక శక్తులకు ఊతం

సఖినేటిపల్లి: కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో విధ్వంసక శక్తులకు ఊతమిచ్చినట్టు ఉందని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మంగళవారం కేశవదాసుపాలెంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో వేమా మాట్లాడారు. పాకిస్తాన్‌లో ప్రధానిగా నరేంద్ర మోదీ కావాలని కోరుకుంటున్న తరుణంలో, కర్నాటకలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో కొంతమంది ఆ పార్టీ అండదండలతో పాకిస్తాన్‌ని కొనియాడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నీరు పారేదెలా!

- పిల్ల కాలువల్లో పేరుకుపోయిన తూడు
- ముందుకు పారని సాగునీరు

కొత్తపేట: పంట భూములకు సాగునీరు పారే పలు పిల్ల కాలువల్లో గుర్రపుడెక్క, వ్యర్థాలు పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ప్రతి సీజన్‌లో సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి ఆయకట్టులో చివరి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆ మేరకు సంబంధిత ఇరిగేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు సాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డెల్టా కాలువలకు సకాలంలో సాగు నీరు విడుదల చేస్తుంది. అయినా ప్రధాన పంట కాలువల్లో నీరు ఉన్నా పిల్ల కాలువలకు నీరు ఎక్కడం లేదు. కాలువలు కట్టుబడి తరువాత నియోజకవర్గంలో అనేక పిల్లకాలువలను మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా బాగు చేశారు. అయితే పలు కాలువలను పట్టించుకోకుండా గాలికొదిలేశారు. అందుకు కింది స్థాయి అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఇరిగేషన్ శాఖ ద్వారా పలు ప్రధాన పంట కాలువలు, కాలువలు బాగుచేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఆ పనులకు సంబంధించి సాగునీరు విడుదలకు ముందే టెండర్, తదితర ప్రక్రియలు చేపట్టకపోవడంతో పనులు చేపట్టని పరిస్థితి. ఉదాహరణకు కొత్తపేట మండలంలోని పాత వాడపాలెం కాలువ ఒకటి. దీని కింద సుమారు వెయ్యి ఎకరాల భూముల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ కాలువ ఎప్పుడూ బాగుచేయక రబీ (దాళ్వా) సీజన్‌లోనే కాక ఖరీఫ్ (సార్వా)లో కూడా శివారు భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆ కాలువలో తూటు, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారి తరఫున పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

గుర్రపుడెక్క తొలగింపునకు ప్రతిపాదనలు

కొత్తపేట, గోపాలపురం ఇరిగేషన్ సెక్షన్ల పరిధిలోని కొత్తపేట, అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం, అమలాపురం మండలాల్లో సుమారు 50 పిల్ల కాలువలో గుర్రపుడెక్క, వ్యర్థాల తొలగింపునకు, పలు డీపీల షట్టర్స్‌కు సంబంధించి సంబంధిత సెక్షన్ ద్వారా ప్రతిపాదనలు పంపారు. గోపాలపురం సెక్షన్‌లో రూ.25 లక్షలు, కొత్తపేట సెక్షన్ పరిధిలో పలు కాలువలకు సంబంధించి రూ.25 లక్షలకు ప్రతిపాదనలు పంపించామని అధికారులు తెలిపారు.



కొత్తపేటలో తూడు, గడ్డితో నిండిన పాత వాడపాలెం పిల్లకాలువ

ప్రతి సీజన్‌లో సాగు నీటి ఇబ్బంది



పాత వాడపాలెం కాలువ కింద వందలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంట కాలువలో పేరుకుపోయిన తుక్కు, వ్యర్థాలతో పొలాలకు నీరు అందడం లేదు. గతేడాది ప్రభుత్వం నిధులు విడుదల చేసినా సకాలంలో పనులు చేపట్టలేదు. ఆలస్యంగా పనులు మొదలుపెట్టడంతో ప్రయోజనం లేకుండా పోయింది. నారుమడులు, నాట్లు జాప్యం జరిగింది. ఫలితంగా పంట జాప్యంతో ఇటీవల అకాల వర్షాలకు రైతులు ఇబ్బంది పడ్డారు. అలా కాకుండా కాలువలకు నీరు విడుదల చేయకముందే చానల్స్ బాగు చేయాలి.

– నేలపూడి భీమరాజు, ఎంపీటీసీ, వాడపాలెం

ఇబ్బంది లేకుండా చర్యలు



కొత్తపేట ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో సాగునీరు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గడచిన రబీ సీజన్ గోదావరి జలాలు తగ్గిపోయి, ప్రధాన పంటకాలువకు నీరు తక్కువగా వచ్చినా వంతుల వారీ విధానం అమలు, లాకుల వద్ద తగినంత నీటిమట్టం కట్టి సాగునీరు సరఫరా చేశాం. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కూడా సాగు నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా తుక్కు, వ్యర్థాల తొలగింపునకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి, శివారు భూములకూ నీరందించేలా చర్యలు తీసుకుంటాం.

– వి.నవీన్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఓ, కొత్తపేట

ముగిసిన హనుమాన్ జయంతి వేడుకలు

ఆలమూరు: స్థానిక బస్టాండు సెంటర్‌లో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈనెల 15న హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా ప్రారంభించిన ఈ ఉత్సవాలను వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఐదువేల మందికి పిండివంటలతో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి.

భారీ అన్నసమారాధన

అంబాజీపేట: హనుమాన్ జయంతి పురస్కరించుకుని అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనను మంగళవారం నిర్వహించారు. తొలుత స్వామికి తమలపాకులు, సింధూర కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి విజయవాడకు చెందిన ఆర్.వెంకటేశ్వర్లు, సంధ్యారాణి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆయన చేతుల మీదుగా అందించారు.

పార్టీలకు అతీతంగా సహకరించాలి

- ఆత్రేయపురంలో అల్లూరి పేరుతో రూ.కోటితో చెరువు అభివృద్ధి
- ఎస్సీ, బీసీ ఏరియాల్లో అభివృద్ధి పనులు
- అన్ని పార్టీల నేతలతో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: పార్టీలు, వర్గాలకు అతీతంగా పేదలకు సంక్షేమాన్ని అందించి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హితవు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అధికారులతో పాటు రాజకీయ పార్టీలకు అతీతంగా మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆత్రేయపురంలో తాజాగా జరుగుతున్న పార్కు, వాకింగ్ ట్రాక్ పనులపై చర్చ జరిగింది. సుమారు రూ.కోటి నిధులతో ఈ పనులు చేపట్టారు. గ్రామంలో ఎస్సీ, బీసీ ఏరియాల్లో రోడ్లు, డ్రైన్స్ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతుండగా ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలనే రాద్ధాంతం చేశారు. ఎమ్మెల్యే ఒకవైపు వారిస్తున్నా గొడవ చేస్తూనే ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం పనులు చేయాలి గానీ రాజకీయాలు కాదన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుందామన్నారు. రాజకీయ పార్టీల నేతలు ఆధిపత్య పోరులో గ్రామాలు నలిగిపోకూడదన్నారు. పాడి పంటలతో విరాజిల్లే గ్రామాలు అభివృద్ధి చెంది ప్రతి నియోజకవర్గానికి ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలు గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ప్రతిపక్షాలను సైతం తాము అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామన్నారు. సీఎం జగన్ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తుంటే గ్రామాల్లో కొందరు రాజకీయాలు చేసి అభివృద్ధికి ఆటంకంగా మారారన్నారు. ఇక నుంచి అలాంటి రాజకీయాలు ఆపేసి కలసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ప్రొటోకాల్ పాటించాలని, ప్రతిపక్ష పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇలా ఎవరు ఉన్నా సరే ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. నాయకులు ప్రజలు సంక్షేమం కోసమే పని చేయాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన విషయాలను పక్కన పెట్టేసి ఇక నుంచి ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి కలసి రావాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా సరే నేరుగా తమతో చెప్పాలని అధికార, ప్రతిపక్ష భేదాలు లేకుండా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పార్టీలను చూడదని, వర్గాలను పట్టించుకోకుండా అర్హులకు సంక్షేమాన్ని అందిస్తుందని, కానీ ఇలా ఆధిపత్య పోరులో గ్రామాభివృద్ధికి అడ్డు పడితే సహించమని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, ఎంపీటీసీలు చిలువూరి బాబిరాజు, ఆత్రేయపురం మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ గెడ్డం సుధ, ఎంపీడీవో నాతి బుజ్జి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ‘కుడుపూడి’కి ఘన స్వాగతం



గోపాలపురంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు స్వాగతం పలుకుతున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం/కొత్తపేట: ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి మంగళవారం మొట్టమొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన కుడుపూడి సూర్యనారాయణరావుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులతో కలిసి రావులపాలెంలో ఘన స్వాగతం పలికారు. ముందుగా గోపాలపురంలో ఎమ్మెల్యే స్వగృహం వద్దకు విచ్చేసిన కుడుపూడి సూర్యనారాయణరావుకు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రావులపాలెం సెంటర్లో దివంగత నేతలు వైఎస్సార్, చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోనసీమ ముఖద్వారం వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బీసీ అంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నిరూపిస్తూ సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయేలా మంత్రిమండలిలో 10 మంది బీసీలకు మంత్రి పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో 50 శాతం బీసీలకు, నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి అందులో ఒక శెట్టిబలిజ సామాజికవర్గ నాయకుడిని తొలిసారి రాజ్యసభకు పంపారన్నారు. అన్ని సామాజిక వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తూ సామాజిక న్యాయం అనే పదాన్ని ఆచరణలో చూపిన నాయకుడు జగన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఈ విషయాలన్నీ గమనించి జగన్‌కు జై కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అప్పారి విజయకుమార్, సాకా ప్రసన్నకుమార్, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే రావులపాలెం నుంచి మండపల్లి మీదుగా కొత్తపేటకు తోడ్కొని వచ్చారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకోగానే వైఎస్సార్ సీపీ శ్రేణులు, శెట్టిబలిజ సంఘాల నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనస్వాగతం పలికారు. బాణసంచా పేల్చి బ్రహ్మరథం పట్టారు. అక్కడ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి, విశ్వరూప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు పాల్గొన్నారు.

ముక్కామల సెంటర్ నుంచి...

అంబాజీపేట: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు విచ్చేస్తున్న కుడుపూడి సూర్యనారాయణకు వైఎస్సార్ సీపీ నాయకులు, శెట్టిబలిజ సంఘ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ముక్కామల సెంటర్ నుంచి ఇరుసుమండ, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్ మీదుగా అమలాపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి

ఎమ్మెల్యే చిట్టిబాబు



ఎల్.గన్నవరంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. లంకల గన్నవరంలో మంగళవారం గడప గడపకూ కార్యక్రమం జరిగింది. సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, పార్టీ నాయకులు మానుకొండ ప్రసాద్, అన్నాబత్తుల చంటి, పెమ్మాడి మారుతీ, పమ్మి అనిల్‌కుమార్ తదితరులతో కలిసి చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. జగన్ నాలుగేళ్ల పాలనలో కలిగిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరిస్తూ పత్రాలు అందజేశారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియా కలసి జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ జగన్ సీఎంగా గెలుపొందుతారని చిట్టిబాబు అన్నారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, పార్టీ నాయకులు దొంగ వినాయకరామ్, ధర్మాడి శ్రీను, ఉలిశెట్టి బాబీ, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా సీఎం జగన్

అయినవిల్లి: రైతులకు వెన్నుదన్నుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్ జున్నూరి బాబి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంఏఎస్ఎంఏ అధ్యక్షుడు కాకిలేటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అయినవిల్లిలంక ఆర్బీకే ఆధ్వర్యంలో క్లస్టర్ హయ్యర్ గ్రూప్స్‌కి వైఎస్సార్ యాంత్రీకరణ ద్వారా కృషి ట్రాక్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏవో వై.శోభ, ఎంపీటీసీ రావూరి బుజ్జి, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలకుండా డివిజన్ పరిధిలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఎల్పీవో పి.బొజ్జరాజు అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 85 శాతం ఇంటి పన్నులు వసూలు చేశామన్నారు. మిగిలిన 15 శాతం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు వివాదాల్లో ఉన్నాయన్నారు. గ్రామాల్లో నిర్మించిన సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్ ఆయన వెంట ఉన్నారు. అంతకుముందు పంచాయతీకి సంబంధించిన సమస్యలపై నాగాబత్తుల శాంతకుమారితో చర్చించారు.

వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలి

పి.గన్నవరం: వశిష్ట నదీ పాయపై వంతెన నిర్మాణ ప్యాకేజీలో భాగంగా ప్రధాన పంట కాలువపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశించారు. ఉచ్చులవారిపేట, చింతావారి పేటల మధ్య పంట కాలువపై జరుగుతున్న వంతెన పనులను చిట్టిబాబు మంగళవారం పరిశీలించారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.49.5 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ముందు ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మిస్తారు. అనంతరం నదీపాయపై వంతెన పనులను ప్రారంభిస్తారు. ఎమ్మెల్యే చిట్టిబాబు వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

పైపులైన్‌లు నిర్మిస్తాం

అంబాజీపేట: రోడ్డు నిర్మాణ పనుల్లో పాడైన మంచి నీటి పైపులైన్‌లను తొలగించి వాటి స్థానే నూతన పైపులైన్‌లను నిర్మించి తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎన్‌వీ పద్మనాభం అన్నారు. వాకలగరువులో తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని పైపులైన్‌లు వేయాలంటూ ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు అమలాపురంలో జరిగిన స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి పైప్‌లైన్లను మంగళవారం పరిశీలించి పాడైన పైపుల స్థానే నూతన పైపులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ వహించాలి



పలివెలలో ఉపాధి కూలీలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న రాజబాబు



పెదపళ్ల పీహెచ్‌సీలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొత్తపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్థానిక మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజబాబు ప్రజలకు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని పలివెలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతాల్లో అవిడి పీహెచ్‌సీ పలివెల సబ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల మాచరరావు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేట: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల డెంగీ వ్యాధిని నివారించవచ్చనే అవగాహన ప్రజల్లో తీసుకురావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి కేఎస్ రాజబాబు అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మొసలపల్లిలో డెంగీ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ చిన్న దోమకాటు వల్ల డెంగీ వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.వెంకటేష్, ఏఎన్ఎంలు బి.చంద్రకళ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: డెంగీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకు రావాలని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఈ ర్యాలీ జరిగింది. డెంగీ ప్రాణాంతమైన వ్యాధి అని ఏడిస్ దోమ కుట్టడం ద్వారా ఇది వ్యాప్తి చెందుతుందన్నారు. డెంగీ ఫీవర్ వచ్చిన ఆరు రోజుల తర్వాత దాని లక్షణాలు కనిపిస్తాయన్నారు. తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, వికారం, తొందరగా అలసిపోవడం, జ్వరం, వాంతులు, అయిదు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు రావడం, తేలకపాటి రక్తస్రావం దీని లక్షణాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ ఎం.శ్రీనివాసరావు, హెచ్‌వీ బి.జయకుమారి, హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ వైద్యారోగ్య సూచనలు, సలహాలను పాటిస్తూ డెంగీ నిర్మూలనకు అందరూ కృషి చేద్దామని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్ బాబు, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పీహెచ్‌సీల ఆవరణలతో పాటు ఆయా గ్రామ సచివాలయాల్లో మంగళవారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, ఉమ, సీహెచ్ బేబి, ఫార్మాసిస్టు సుగుణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.